నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
మంగళవారం | 11 మార్చి 2025 పేజీలు 8

### రహదారి భద్రత నిబంధనల పై
# ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

- కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ :** రహదారి భద్రత నిబంధనలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద హెల్మెట్, ఆటో అనౌన్స్‌మెంట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచేందు కే ఈ ఆటో అనౌన్స్‌మెంట్

మిగతా 2లో


జెండా ఊపి ఆటో ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ

- సమస్యల పరిష్కారానికి కదంతొక్కిన కామ్రేడ్‌లు
- ధర్నాలతో ట్రాఫిక్‌కు అంతరాయం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వామపక్ష పార్టీలతో పాటు ఏపిఎస్ ఆర్టీసి రిటైర్డ్ ఎంప్లాయిస్, ఏఐఎస్ఎఫ్ ఆద్వర్యంలో సోమవారం కర్నూలు కలెక్టరేట్ వద్ద ధర్నాలతో దద్దరిల్లింది. ఉదయం10 గంటల నుండి ప్రారంభమైన నిరసన హోరులో మద్యాహ్నం 1గంట వరకు యధేచ్ఛగా మండుటెండను సైతం లెక్క చేయకుండ సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలంటూ కలెక్టరేట్ వద్ద బైఠాయించి నిరసనలు కొనసాగించారు.

**సామాజిక పెన్షన్లు ఇవ్వాలని నిరసన : ఏపిఎస్ ఆర్టీసి రిటైర్డ్ ఎంప్లాయిస్ :** ఏపిఎస్ ఆర్టీసిలో పనిచేసి రిటైర్డ్ అయిన ఎంప్లాయిస్‌కు సామాజిక వృద్దాప్య పెన్షన్లను ఇవ్వాలని కోరుతూ సోమవారం కర్నూలు కలెక్టరేట్ వద్ద ఏపిఎస్ ఆర్టీసి రిటైర్డ్ ఎంప్లాయిస్

మిగతా 2లో


ఇంటి స్థలాల కోసం ధర్నా చేస్తున్న దృశ్యం


ఎండ నుండి చిన్నారిని కాపాడుతున్న తల్లి


తల్లితో పాటు నిరసనలో చిన్నారి

# ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్..!


నిరసనల హోరుతో హోరెత్తిన కలెక్టరేట్

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏడవ రోజు అయిన సోమవారం శ్రీ జ్వాల నరసింహస్వామి శ్రీ వేణుగోపాలన్ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహదేశికన్ స్వామి సమక్షంలో అహోబిలం జనరల్ మేనేజర్ మురళీధరన్, జాబితా సలహా సభ్యులు వైకుంఠం, మణియార్ / అడ్మినిస్ట్రేషన్ సుదర్శన్‌ల ఆధ్వర్యంలో

మిగతా 2లో





# వేణుగోపాలన్ అలంకారంలో శ్రీ జ్వాలా నరసింహస్వామి విహారం

- ప్రహ్లాద వరదునికి మోహిని అలంకారం
- చక్రవట నరసింహస్వామి ఆలయం వద్ద మోహిని అలంకారంలో ఉన్న స్వామికి పూజలు



### 12న కలెక్టరేట్ ముందు
# యువత పోరుబాట

- వైసీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేంద్రరెడ్డి


తెర్నేకల్ సురేందర్‌రెడ్డి,వైసిపి రాష్ట్ర కార్యదర్శి

**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఈ నెల 12న కర్నూలు కలెక్టరేట్ ముందు యువత పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసిపి రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి నిరుద్యోగులను, యువ తను,విద్యార్థులను మోసం చేసిందన్నారు. కూటమి పాలనలో దగా పడ్డ యువత ఫీజురీయింబర్స్‌మెంట్,నిరుద్యోగ భృతి లేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో విద్య,వైద్యం అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు చేయడం జరిగిందన్నారు. 12న జరిగే యువత పోరును

మిగతా 2లో

### విహెచ్‌పి,ఆర్ఎస్ఎస్‌ల పై బురదజల్లితే
# సహించేది లేదు..

- విహెచ్‌పి రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి



నిరసన ర్యాలీలో విహెచ్‌పి నాయకులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్ న్యూస్ :** రాయచోటి ఘటనలో జాతీయ హిందూ సంస్థలైన విహెచ్‌పి,ఆర్ఎస్ఎస్‌లపై ఓ వర్గం వారు బురద జల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని విహెచ్‌పి రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి ఘటనకు నిరసనగా నగరంలోని వినాయక ఘాట్ నుండి కలెక్టరేట్ వరకు విహెచ్‌పి, భజరంగ దళ్, ధార్మిక సంస్థల ప్రతినిధులు, బిజెపి నాయకులు పెద్దసంఖ్యలో హాజరై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మిగతా 2లో

### తూతూ మంత్రంగా
# పిజిఆర్ఎస్ నిర్వహణ..

- మండలంలో విడివిడిగా పిజిఆర్ఎస్ నిర్వహణ
- పిజిఆర్ఎస్ కు అధికారులు డుమ్మా
- మారని అధికారుల తీరు

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** మండలంలో పిజిఆర్ఎస్ కు అధికారులు హాజరు కాకపోవడంతో ఈ కార్యక్రమం నిర్వహణ పై ప్రజలు పెదవీవిరస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కరానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పిజిఆర్ఎస్ కు అధికారులు రావడమే మానేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు లేక ముగ్గురు, ఎంపీడీఓ కార్యాలయంలో ఒక్కరు లేక ఇద్దరు అధికారులు పాల్గొనే పరిస్థితి ఇది. మండలంలోపిజిఆర్ఎస్ నిర్వహణ పరిస్థితి ఇది..

మిగతా 2లో


ఎంపీడీఓ కార్యాలయంలో పిజిఆర్ఎస్ కు అధికారులు లేని దృశ్యం

సూర్య



# వేణుగోపాలన్ అలంకారంలో శ్రీ జ్వాలా నరసింహస్వామి విహారం

(మొదటి పేజి తరువాయి)







వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉదయం శ్రీ జ్వాల నరసింహ స్వామిని వేణుగోపాలన్ అలంకారంతో పాటు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవ ముమూర్తులకు అర్చకులు వేదమంత్రాల మధ్య పంచామృతాభిషేకం నిర్వహించారు. రాత్రి శ్రీ జ్వాల నరసింహ స్వామి పొన్నచెట్టు వాహనంపై కొలువు దీరి భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం పొన్న చెట్టు వాహనంపై స్వామివారిని కూర్చోండబెట్టి ఆలయ మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

**దిగువ అహోబిలంలో :**

దిగువ అహోబిలం లో బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరవ రోజైన సోమవారం ఉత్సవమూర్తి శ్రీ ప్రహ్లాద వరద స్వామిని తమిళనాడులోని శ్రీవల్లి పుత్తూరు క్షేత్రంలో అమ్మవారికి సమర్పించిన గజమాల, చిలకలతో మోహిని అలంకారంలో చూడ ముచ్చటగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలా చార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం వేకువజామునే అర్చక బృందంతో కలిసి ఉత్సవమూర్తులైన శ్రీ ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం మోహిని అలంకారంలో ఉన్న ప్రహ్లాద వరద స్వామికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ మాడ వీధుల గుండా ఊరేగింపుగా మఠం వద్దకు చేరుకున్నారు. మఠం వద్ద 46వ పీఠాధిపతి శ్రీవన్ శ్రీ శఠగోప రంగనాథ యతేంద్ర మహాదేశికన్ స్వామి ఉత్సవ మూర్తులకు మహా మంగళ హారతి సమర్పించి పూజలు నిర్వహించారు. మఠం నుండి మోహిని అలంకారంలో ఉన్న స్వామివారిని నవనారసింహుల్లో ఒకరైన చక్రవట నరసింహస్వామి ఆల యం వద్దకు ఊరేగింపుగా తీసుకొని వెళ్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. మధ్యాహ్నం ఉత్సవముర్తులకు ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు అభిషేకం నిర్వహించారు. రాత్రి శరభవాహనంపై శ్రీ ప్రహ్లాద వరద స్వామి కొలువుదీర్చి మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

## రహదారి భద్రత నిబంధనలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

(మొదటి పేజి తరువాయి)

కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధునాతన ట్రాఫిక్ నియంత్రణ పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. కర్నూలు పట్టణంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో 15 ఆటోలతో ట్రాఫిక్ హెల్మెట్‌పై అవగాహన బ్యానర్లతో ఒక్కరోజు అనౌన్స్‌మెంట్ ర్యాలీని నిర్వహించేందుకు ఆటో యూనియన్‌లు స్వచ్ఛందంగా ముందుకొచ్చాయన్నారు. రద్దీ ప్రాంతాలలో హెల్మెట్‌పై అవగాహన చేస్తూ, సైబర్ నేరాల బారిన పడకుండ ఉండేందుకు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌తో ఆటోలు తిరుగుతూ కర్నూలు పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తాయన్నారు. సామాజిక బాధ్యత కలిగిన దాతల సహకారంతో రద్దీ ప్రాంతాలైన బళ్లారి చౌరస్తా,బస్టాండ్ వంటి పలు ప్రదేశాల్లో 4అధునాతన డిజిటల్ బ్యానర్లను ఏర్పాటు చేశామన్నారు. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు రేడియం జాకెట్స్ 125మూవబుల్ బారికేడ్స్‌ను ఇవ్వడం జరిగిందన్నారు. మైనర్ పిల్లలు డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారిన పడి తల్లిదండ్రులను బాధలకు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ హుస్సేన్ పీరా, ఏఆర్ ఎస్పి క్రిష్ణమోహన్,డిఎస్పీలు బాబూ ప్రసాద్, బాస్కర్‌రావు,సిఐలు మన్సూరుద్దీన్, తేజ మూర్తి,కేశవరెడ్డి,అబ్దుల్ గౌస్,రామయ్యానాయుడు, నాగరాజు రావు,గుణశేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## 12న కలెక్టరేట్ ముందు యువత పోరుబాట

(మొదటి పేజి తరువాయి)

విజయవంతం చేసేందుకు యువత ముందుండాలని పిలుపునిచ్చారు. యువత పోరు కార్యక్రమానికి కూటమి ప్రభుత్వానికి ఓ హెచ్చరిక లాగా ఉండాలన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం 9నెలలు అవుతున్నా ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. లక్షల అప్పుల భారాన్ని ప్రజలపై మోపి సంక్షేమ పథకాలను గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 20లక్షల ఉద్యోగాలిస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృత్తి ఇస్తామని చెప్పి వారికి మొండి చేయి చూపించారన్నారు. వైఎస్ జగన్ 2019లో ముఖ్యమంత్రి అయ్యాక అప్పుడు టిడిపి ప్రభుత్వం పెట్టిన రూ. 1790కోట్ల బకాయిలను సైతం చెల్లించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. డిఎస్‌సిపై తొలిసంతకం పెట్టారని విద్యా శాఖ మంత్రిగా నారా లోకేష్ యువతకు ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలని ఆయన హితవు పలికారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న పవన్‌కళ్యాణ్ హామీల అమలు బాధ్యతను తీసుకోవాలని ఆయన సూచించారు.

## తూతూ మంత్రంగా పిజిఆర్ఎస్ నిర్వహణ..

(మొదటి పేజి తరువాయి)

అధికారుల లోపమో లేక కింది స్థాయి అధికారుల నిర్లక్షమో గాని ఈ ప్రభుత్వ కార్యక్రమాన్ని నీరుకారుస్తున్నారు. వారానికి ఒక్కసారి నిర్వహించే ఈ కార్యక్రమాన్నికి వివిధ శాఖల మండల స్థాయి అధికారులు అటువైపు చూడడం మానేశారు. మండల స్థాయిలో ప్రజా సమస్యలు పట్టనట్టు వస్తున్నారు, పోతున్నారు, కానీ ప్రభుత్వ కార్యక్రమానికి రావడంలేదు, గత ప్రభుత్వంలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి తుచ్చా తప్పకుండా హాజరైయెవారు. నేడు అధికారులకు ఏమైందో తెలియడంలేదు పీజీఆర్ఎస్ కు రావడం లేదు. దీని ప్రభావం అక్కడున్న ఒక్కరిద్దరి అధికారుల పై ప్రభావం చూపుతుంది. ఇకనైనా మండలంలో పనిచేసే వివిధ మండల స్థాయి అధికారులు తీరు మార్చుకొని ప్రభుత్వ అధికారులు నిర్వహించే కార్యక్రమానికి హాజరై ప్రజలకు ప్రభుత్వానికి జవాబుదారిగా పనిచేయాలని సమస్యలు తీర్చాలని ప్రజల్లో వినిపిస్తున్న మాట.

తహశీల్దార్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ లో వివిధ శాఖల అధికారులు లేని దృశ్యం



### విహెచ్‌పి,ఆర్ఎస్ఎస్‌లపై

## బురదజల్లితే సహించేది లేదు..

ఈ సందర్భంగా నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ వీరభద్ర స్వామి ఆలయ పారువేట ఉత్సవ ఊరేగింపులో భాగంగా అన్య మతస్తులు హిందువులపై దాడి చేస్తుంటే వారిని అదుపు చేయలేక పోలీసులు విఫలమయ్యారన్నారు. పక్షపాత ధోరణితో హిందువులపైనే అమానుషంగా లాఠీచార్జ్ చేయడం బాధాకరమన్నారు. అన్ని అనుమతులను తీసుకొని ఉత్సవాలను జరుపుకుంటుంటే భద్రత కల్పించాల్సిన పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. విహెచ్‌పి రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ రాయచోటి ఎస్ఐ నరసింహారెడ్డి హిందువలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆ వ్యాఖ్యలు, ఆయన ప్రవర్తనను త్రీవంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు మద్దిలేటి,నాగరాజులు మాట్లాడుతూ హిందువులపైనే కాకుండ ఓ వర్గం వారు ఏకంగా పోలీస్‌స్టేషన్ల పైన కూడా దాడులు చేసి పోలీసు వాహనాలు దగ్ధం చేసిన సంఘటనలు జరిగాయని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దాడులకు పాల్పడిన ఆ వర్గానికి చెందిన నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లలిత పీఠం పీఠాధిపతి సుబ్రమణ్య స్వామి,విహెచ్‌పి రాష్ట్ర మీడియా కన్వినర్ భాను ప్రకాష్,విశేష సంపర్గ్ కన్వినర్ ప్రతాప్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరి రాఘువేంద్ర, నీలి నరసింహా,భజరంగదళ్ రాష్ట్ర గోరక్షక కన్వినర్ రాజేష్, విహెచ్‌పి నాయకులు గోరంట్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

## నాయకులకు,అధికారులకు సత్కారం

**బనగానపల్లెరూరల్,న్యూస్‌:** యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఇటీవల ఘనంగా ముగిశాయి. అయితే ఈ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా యాగంటి స్వామికి వచ్చిన భక్తులకు సేవా కార్యక్రమాలు అందించినందుకు బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన నంద్యాల జిల్లా వాణిజ్య విభాగాల అధ్యక్షులు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య అలాగే బనగానపల్లె రూరల్ సి.ఐ మంజునాథ్ రెడ్డి, ఆర్.డబ్ల్యు.ఎస్ ఎ.ఈ సాయిక్రిష్ణ ప్రభుత్వ ఉద్యోగులకు ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రుడు, యాగంటిపల్లె ఉప సర్పంచ్ బండి మౌళీశ్వర రెడ్డిలు వారిని శాల్వతో సన్మానించి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. బండి వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది నాగేంద్ర, మల్లారెడ్డి, తలారి తిరుమలయ్య, తదితరులు పాల్గొన్నారు.





# ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్..!

(మొదటి పేజి తరువాయి)

అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ కార్యవర్గ సభ్యుడు ఎస్ఎస్ రావ్, రీజనల్ సెక్రటరీ శ్రీనివాసులు మాట్లాడుతూ తమకు రిటైర్డ్ అయిన తర్వాత కేవలం రూ. 1500నుంచి రూ. 2 వేల వరకు మాత్రమే పెన్షన్ లభిస్తుందని అయితే ప్రభుత్వం పునరాలోచించి రిటైర్డ్ అయిన ఆర్టీసి ఎంప్లాయిస్‌కు సామాజిక పెన్షన్లు అందచేయాలని డిమాండ్ చేశారు.

**ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి : ఏఐఎస్ఎఫ్ :** రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను కూటమి ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విశ్వ విద్యాలయాల్లో కామన్ పిజి ఎంట్రన్స్ పరీక్షలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పిజి కామన్ ఎంట్రన్స్ ద్వారా అడ్మిషన్లు చేపట్టడం ద్వారా ఈ ఏడాది విద్యార్థులు లేక డిపార్ట్‌మెంట్లు మూసివేసే పరిస్థితికి తీసుకొచ్చిందన్నారు.

**విద్యార్థులకు శాపంగా మారిన జీవో :** 77ను రద్దు చేస్తామని ప్రకటించిన నారా లోకేష్ హామీని అమలు చేసి నిలబట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు సోమన్న,షబ్బీర్ హుస్సేన్,సంయుక్త కార్యదర్శి శరత్ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా సమగ్ర అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి : సిపిఐ :** జిల్లా సమగ్ర అభివృద్ధికి రూ. 10వేల కోట్లకుపైగా నిధులను కేటాయించాలని సిపిఐ ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట పెద్దసంఖ్యలో నాయకులు హాజరై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సిపిఐ నాయకులు మునెప్ప, జగన్నాథం, రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, కర్నూలు జిల్లాను వెనుకబడ్డ జిల్లాగా గుర్తించి కేంద్రం నుంచి అధిక సంఖ్యలో నిధులను రాబట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకపోతే కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

**ఇళ్ల స్థలాల సాధనకై కలెక్టరేట్ ముట్టడించిన సిపిఎం :** కర్నూలు కార్పొరేషన్ పరిధిలో అర్హులైన పేదప్రజలకు 15 రోజుల్లోగా స్థలాలు ఇవ్వకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ అన్నారు. సోమవారం ప్రజలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ వద్దనున్న గాంధీ విగ్రహం ముందు భారీగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ దేశాయ్, నిర్మలమ్మలు మాట్లాడుతూ సొంత ఇంటి కలను పేదప్రజలకు నెరవేర్చలేని ప్రభుత్వం ఉండి దండగే అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాధాకృష్ణ,రాముడు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

**ఎండను సైతం లెక్కచేయకుండ ఆందోళనలో పాల్గొన్న మహిళలు :** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వామపక్ష పార్టీలు మండుటెండల్లో నిరసన చేపడుతున్న నేపథ్యంలో మేముసైతం అంటూ మహిళలు చంటి బిడ్డలతో ఎండను సైతం లెక్కచేయకుండ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎండలోనే తమ పిల్లలకు రక్షణ కవచాలను కప్పి నిరసనలో పాల్గొని అందరిని ఆశ్చర్య పరిచారు.




ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన




సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం




నిరసన చేస్తున్న ఏపిఎస్ ఆర్టీసి విశ్రాంత ఉద్యోగులు

## పోసానిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ :** ప్రముఖ సినీనటుడు,రచయిత పోసాని కృష్ణమురళీ గత ఏడాది చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌లను దూషించిన కేసులో కర్నూలు జిల్లా సబ్ జైలులో ఉన్న పోసానిని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకుల మీద కక్ష్యసాధింపులు కొనసాగుతున్నాయని, వైసిపి నాయకులు ఏం మాట్లాడినా అక్రమ కేసులు పెడుతున్నారని టిడిపి నాయకులు మాట్లాడితే మాత్రం కేసులు పెట్టరా అని అన్నారు. చట్టం అనేది ఎవరి సొత్తు కాదని అందరికి సమానంగా ఉండాలన్నారు. కాలం ఎప్పుడు ఒకే మాదిరిగా ఉండదని గుర్తు పెట్టుకుని నడుచుకోవాలని టిడిపి నాయకులను హెచ్చరించారు. పోసాని కృష్ణమురళీపై అక్రమ కేసులు బనాయించి ఈ నెల 5న ఆదోని పోలీసులు పెట్టిన కేసు మేరకు జిల్లా సబ్ జైలుకు తరలించినప్పటి నుండి రాష్ట్రంలోని పలు స్టేషన్లకు తిప్పుతూ ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు.

## రైతుల విజయ గాధల పుస్తకాలు ఆవిష్కరించిన కలెక్టర్



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్,జెసి

**కర్నూలు నగరం, మేజర్ న్యూస్ :** ప్రకృతి వ్యవసాయ నవ సార్వత్రిక సూత్రాలు,ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళా సంఘాలు ఆచరించవలసిన సప్త సూత్రాల వాల్‌పోస్టర్లను,రైతుల విజయగాధల పుస్తకాలను జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా,జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్యలు సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయ నవ సూత్రాలు, ప్రకృతి వ్యవసాయ విస్తరణలు, మహిళా సంఘాలు ఆచరించవలసిన సప్త సూత్రాలు పాటించి తమ పంట దిగుబడులను లాభసాటిగా మార్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి పిఎల్ వరలక్ష్మి, ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ ,డిఎల్ఎంపి లక్ష్మయ్య, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సందీప్ కుమార్,నాచురల్ ఫామింగ్ అసోసియేట్స్ మల్లికార్జున,జగదీష్ పాల్గొన్నారు.

## మహిళల హక్కులే మానవ హక్కులు

**కల్లూరు, మేజర్ న్యూస్ :** మహిళల హక్కులే మానవ హక్కులు అని ఎస్‌సి,ఎస్‌టి,బిసి,మైనార్టీ ఐక్య వేదిక వ్యవస్థాపకురాలు పట్నం రాజేశ్వరి,రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మిలు అన్నారు. సోమవారం నగరంలోని బి క్యాంపు నందు ఎస్‌సి,ఎస్‌టి,బిసి,మైనార్టీ ఐక్య వేదిక కార్యాలయంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మహిళా ఐక్యవేదిక ఆద్వర్యంలో మౌర్య ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా త్రీ టౌన్ సిఐ శేషయ్య హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి,బిసి,మైనార్టీ ఐక్య వేదిక పోరాటాలు చేస్తూనే సామాజిక సేవ చేయడం మంచి పరిణామమని ప్రజాసంఘాలు అందరు కూడా మహిళా ఐక్య వేదికను ఆదర్శంగా తీసుకుని పోరాటాలతో పాటు సామాజిక సేవలో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిప్రసాద్, ఎరుకలి రాజు,శేషఫణి,మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# సారారహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం: నంద్యాల కలెక్టర్




సారా రహిత వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీలు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సారా నిర్మూలనకు ప్రభుత్వం నవోదయం 2.0 పేరుతో ఒక కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఈ మేరకు నంద్యాల జిల్లాను సారా రహిత జిల్లాగా తీర్దిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు ముందు సారా నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నాటుసారిను అరికట్టేందుకు అధికారులు సమన్వయం చేసుకుని 19గ్రామాల్లో నాటుసారా తయారీ కేంద్రాలను గుర్తించారని ఈ ప్రాంతాల నుంచి అక్రమ రవాణా నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సారా తయారు చేసే వ్యక్తులు ఖచ్చితంగా పురరావాసం కల్పించాలని కోరుతారని ఇందుకు సంబంధించి డీఆర్‌డీఏ, డ్వామా అధికారులు పునరావాస కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెంట్ రవికుమార్ మాట్లాడుతూ నాటుసారా తయారీ చేసే వ్యక్తులు, తరలించే వారు, విక్రయించే వారిని గుర్తించి వివరాలు సేకరించేందుకు గ్రామ, మండల స్థాయిలో రెవెన్యూ, పోలీస్, రెవెన్యూ అటవీ ఎక్సైజ్ అధికారులతో పాటు సర్పంచ్‌లు, మహిళా సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసి గ్రామ, మండల, జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా నవోదయం 2.0పోస్టర్‌ను కలెక్టర్, జేసీలు ఆవిష్కరించారు.

## వైన్ షాపుల వద్ద మద్యం సేవిస్తే షాప్ సీజ్

**– ఎన్ఫోర్స్మెంట్ సిఐ కృష్ణ**



**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** వైన్ షాపు వద్ద మద్యం సేవిస్తున్నారని ఫిర్యాదులు వస్తే షాపు సీజ్ చేస్తామని ఎన్ఫోర్స్మెంట్ సిఐ కృష్ణ హెచ్చరించారు. మండల కేంద్రంలోని రెండు మద్యం దుకాణాలను ఎక్సైజ్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీ చేశారు. షాపుల వద్ద మద్యం సేవిస్తున్న వారిని అక్కడి నుంచి పంపించారు. మరలా పునరావృత్తమైతే దుకాణాన్ని సీజ్ చేస్తామని వారు తెలిపారు. లైసెన్స్ కనిపించకపోవడంతో దుకాణాదా రులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ లైసెన్స్, ధరలు కనిపించేలా ప్రదర్శించాలని తెలిపారు. మండలంలోని పోతులపాడు గ్రామంలో బెల్ట్ షాపులపై దాడులు చేసి 12 మద్యం బాటిళ్లు, పారుమంచాల గ్రామంలో ఓ వ్యక్తి నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## మహానంది క్షేత్రంలో వసతి సముదాయాల కూల్చివేత

**– ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దాతలు**



**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణక్షేత్రంలోని నాగనంది సదనం వసతి సముదాయాలను కూల్చివేయడంపై దాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల కిందట 50 గదుల నాగనంది సదనం వసతి సముదాయాల పేరుతో మొదటి దశలో 12 గదులను నిర్మించారు. మరలా కొన్ని సంవత్సరాల అనంతరం మరో 12 గదులను నిర్మించారు. వీటన్నింటిని దాతల సహకారంతోనే నిర్మించారు. అయితే నూతనంగా 50 గదుల వసతి సముదాయాల పేరుతో నాగనంది సదనంలోని పాత 12 గదులను అధికారులు కూల్చివేస్తున్నారు. లక్షల రూపాయలు దాతల నుంచి స్వీకరించి వాటిని కూల్చడంపై దాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవాలయ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రదేశాలు ఎకరాల కొద్ది ఉంటే దాతల సహకారంతో నిర్మించిన గదులను కూల్చడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆలయం అభివృద్ధి చెందాలంటే ఉన్న వసతి గదులకు మరిన్ని వసతి గదులు ఏర్పాటు చేయాలే తప్ప ఉన్న అరకొర వసతి గదులను కూల్చడంపై భక్తులు, ప్రజలు, దాతలు తమదైన శైలిలో విమర్శలు గుప్పిస్తున్నారు. క్షేత్రం అభివృద్ధి మాట ఏమో కానీ దాతల సహకారంతో నిర్మించిన గదులను కూల్చడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా క్షేత్రం అభివృద్ధి అంటే అని ప్రశ్నిస్తున్నారు.

## వైసీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎప్పుడు అండగా

**■ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ**



మృతుని కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** మృతి చెందిన వైఎస్సార్సిపి కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ పేర్కొన్నారు. సోమవారం ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పత్తికొండ మండలం పందికొన గ్రామ వైఎస్సార్ పార్టీ కార్యకర్త బాలరాజును పత్తికొండ మాజీ ఎమ్మెల్యే పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రి మార్చ్యూరి వద్ద సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఎంపిపి నారాయణ దాసు, మాజీ సర్పంచు సోమశేఖర్, మండల కన్వీనర్‌కారంనాగరాజు, వైసీపీ నాయకులు బనగాని శ్రీనివాసులు, జయచంద్రరెడ్డి, కోలంట్ల నాగరాజు, పందికోన గ్రామం వైసిపి నాయకులు రవి, బాలరాజు, కార్యకర్తలు ఉన్నారు.

## బండలాగుడు పోటీలు ప్రారంభించిన టిడిపి నాయకులు



**ఓర్వకల్లు, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఎన్ కొంతలపాడు గ్రామంలో వెలసిన యాగంటి ఈశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన వృషభాల బండలాగుడు పోటీలను నంద్యాల జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు,గుట్టపాడు సర్పంచ్ మోహన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ పోటీలలో 15జతల వృషభాలు పాల్గొన్నాయి. గెలుపొందిన వృషభాలకు వరుసగా బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసి చైర్మన్ శ్రీరాములు,కొంతలపాడు గ్రామ తెదేపా నాయకులు దేవస్థాన చైర్మన్ శ్రీనివాసులు,చంద్రశేఖరప్ప,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షలకు సన్నద్ధం



మాట్లాడుతున్న ఎంఈఓ యశోధ

**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరిపించుటకు పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని మండల విద్యా శాఖ అధికారిణి యశోధ పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బండిఆత్మకూరు మండలంలో 3 పరీక్షా కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. మండల కేంద్రమైన బండిఆత్మకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు, ఆదర్శ పాఠశాలలో 220 మంది విద్యార్థులు, సంతజూటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. పరీక్షలకు సంబంధించి మొదటి దశ ప్రశ్నా పత్రాలు జిల్లా కేంద్రం నుంచి సోమవారం బండిఆత్మకూరు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాయని అన్నారు. ఈ పరీక్షా పత్రాలను పరీక్షల చీఫ్ సూపరింటిండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు వాటిని పరిశీలించి భద్రపరచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 మోహన్ రెడ్డి, విద్యా శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సూర్య





# నత్త నడకన.. డ్రైనేజీ పనులు

- మరోసారి ఎమ్మెల్యే క్లాస్ తీసుకోవాల్సిందేనా ?
- అధికారులే సమన్వయం లోపంతో అటకెకిస్తున్నారా ?
- ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించిన.. అధికారులు తీవ్ర జాప్యం విద్యుత్ స్తంభాలకు కనెక్షన్ల
- షాకుతో ఆగిన పనులు డ్రైనేజీ,రోడ్డు పనులు ముందుకు సాగేనా..

ఎన్నో సంవత్సరా లుగా విస్తరణకు నోచుకోని బండి ఆత్మకూరు సంత గేటు రహదారి పనులను కూట మి ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చొరవతో ప్రారం భమ య్యాయి. సీసీ రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు కోసం 25 లక్షల రూపాయల తో నిధులు సమకూర్చి ప్రారంభించినా, అధికారులే సమన్వయం లోపంతో పనులలో తీవ్ర జాప్యం ఏర్పడింది.గత నెలలో విస్తరణ పనులు ప్రారంభించ డానికి స్థానిక ప్రజలతో నియోజకవర్గ ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి ప్రజల నుం డి సమస్యను తీసుకోని అన్ని అడ్డం కులు తొలగించి ఒప్పించి డ్రైనేజీ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం విస్తరణ పనులు ప్రారంభించిన అధికారులు మూడు రోజుల ముచ్చట అనేలా డ్రైనేజీ, రహదారి నిర్మాణం ఏర్పాటుకు అడ్డంగా ఉన్న భవనాలను యుద్ధ ప్రాతిపదికన పడగొట్టారు. ఈ క్రమంలో ప్రజలు నిత్యం ఇంటి అవసరాల కోసం వినియోగించే పైపులైను ధ్వంసం కావడంతో వాటి మరమ్మతులు కు పంచాయతీ అధికారులు పైపులైను ఏర్పాటు చేయకపోవడం తో ప్రజల కష్టాలు పడుతున్నారు. అదే విధముగా విస్తరణ పనుల భాగంగా అ నూతన స్తంభాలను ఏర్పాటు చేసి వదిలేసారు. విద్యుత్తు వైరింగ్ చేయలే దని సాకుగా చూపిస్తూ డ్రైనేజీ పనులను అధికారులు అటకెక్కించారా అని ప్రశ్నిస్తున్నారు. స్తంభాల విద్యుత్ కనెక్షన్ల కోసం అంచనా వేయగా రూ.4.6 లక్షలు అవసరమవుతా యని అందుకు సంబంధించిన నిధులు పంచాయతీ లో లేవని రెండు వారాల క్రిందట బండి ఆత్మకూరు పంచాయితీ కార్యదర్శి విద్యుత్ డిప్యూటీ ఇంజనీర్ కి లేఖ రాశారు. తమ వద్ద విద్యుత్ లైన్ కి కావాల్సిన వైరింగ్ ,పరికరాలు అందుబాటులో లేవని డిప్యూటీ ఇంజనీరింగ్ అధికారి ఎస్టిమేషన్ అప్రూవ ల్ చేసిన తర్వాత విద్యుత్ లైన్ ప్రక్రియ చేపడతామని ఏఈ కంబగిరి తెలి పారు.డ్రైనేజీ ఏర్పాటుకి ఒక పక్కకు మాత్రమే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు ఉండడంతో మరోపక్క డ్రైనేజీ ఏర్పాటు చేసే అవకాశం ఉన్న అటు పంచాయతీ అధికారులు ఇటు పంచాయతీరాజ్ అధికారులు మధ్య సమన్వయ లోపంతో డ్రైనేజీ పనులలో తీవ్ర జాప్యం ఏర్పడుతుందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికే పలుమార్లు డ్రైనేజీ పనులను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి స్థానిక పంచాయతీరాజ్, పంచాయతీ అధికారు లను మందలిం చిన వారిలో నిర్లక్ష్యం తాండవిస్తుండడం గమనార్హం.విస్తరణ పనులలో భాగంగా తమ ఇంటికి అవసరాలకు కొళాయి కనెక్షన్ దెబ్బతీయడం తో పాటు నీటి లీకేజీ లు ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నమని స్థానిక పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మహిళలు వాపోతు న్నారు.ఇది ఇలా ఉండగా డ్రైనేజీ ఏర్పాటు చేయడం కోసం గత కొద్ది రోజులుగా పంచాయతీ రాజ్ ఈ ఈ, డి ఈ అధికారులు వచ్చామా వెళ్ళమా అనే రీతిలో ఉండటంతో రోడ్డు,డ్రైనేజీ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటారా లేదా అనే అనుమానాలు ఎక్కువైపోతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి చిన్న విషయానికి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్న అధికారులకు చీమకు కుట్టినట్లు కూడా లేకపోవడం శోచనీయం.మళ్ళీ డ్రైనేజీ రహదారి పనులు వేగవంతంగా జరగాలంటే స్థానిక ఎమ్మెల్యే అధికారులకు మరో మారు క్లాస్ పీకాల్సిందేనని బండి ఆత్మకూరు ప్రజలు చర్చించుకుంటున్నారు.

**బండి ఆత్మకూరు రూరల్ మేజర్ న్యూస్ :**



# అటవి అధికారులపై ప్రజా ప్రతినిధులు, రైతులు ఆగ్రహం

- దారి నిర్మాణాన్ని అడ్డుకున్న అటవీ అధికారులు
- ఆ దారికి అడుగడుగునా ఆటంకాలే

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది నుంచి వ్యవసాయ కళాశాల వరకు ఉన్న దారి నిర్మాణానికి అడుగడుగునా ఆటంకాలే ఎదురవుతున్నాయి. తాజాగా ఈ దారి నిర్మాణం పనులను అటవీ అధికారులు అడ్డుకోవడంతో రైతులు, ప్రజా ప్రతినిధులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు అత్యుత్సాహంతో ఈ దారి నిర్మాణం అటవీ శాఖ భూమిలో ఉందని అనుమతులు లేవంటూ దారి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ నాయకులు కెసి కెనాల్ చైర్మెన్ బన్నూరు రామలింగా రెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశశ్విని, గాజులపల్లి ఆర్ఎస్ సర్పంచ్ అస్లాం బాషా, తదితర టీడీపీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో దారి నిర్మాణ పనుల వద్దకు చేరుకున్నారు. అటవీ శాఖ డిఆర్ఓ హైమావతి అక్కడికి చేరుకుని అధికారుల ఆదేశాలను వారికి చూపించారు. మీ స్థలం ఇక్కడికి లేదని రోడ్డు పనులు అడ్డుకుంటే సహించేది లేదని ప్రజా ఆగ్రహానికి గురికావద్దని వారికి తెలియజెప్పారు. గత 10 సంవత్సరాల క్రితమే ఈ దారి నిర్మాణానికి అనుమతులు మంజూరైతే అప్పటి రాజకీయమో అధికారుల నిర్లక్ష్యం వల్లనో ఈ దారి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. బోయలకుంట్ల క్రాస్ రోడ్డు నుంచి మహానంది వరకు ఉన్న 8 కిలో మీటర్ల దారి డబుల్ రోడ్డు నిర్మాణంతో పాటు పాలేరు వాగు వంతనపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే అప్పట్లో బోయకుంట్ల మెట్ట నుంచి వ్యవసాయ కళాశాల వరకు డబుల్ రోడ్డు పనులు పూర్తి చేసి అక్కడి నుంచి ఆపివేశారు. అప్పటి నుంచి రోడ్డు పనులు ఇంత వరకు సాగనేలేదు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చొరవతో ఈ దారి నిర్మాణ పనులకు టెండర్లు పూర్తి చేసి పనులకు నెల క్రితం భూమి పూజ కార్యక్రమాన్ని చేశారు. పనులు మొదలు పెట్టడంతో అటవీ అధికారులు అడ్డగించారు. దారి నిర్మాణానికి ఆరు అడుగుల అనుమతి ఉందని వారు ఆరు మీటర్ల వరకు తీస్తున్నారని వారు అడ్డగించారు. గెజిట్ నోటి ఫికేషన్ ప్రకారం పనులు అడ్డుకున్నామని వారు పేర్కొంటున్నారు. అయితే టీడీపీ నాయకులు పనులు ఆపవద్దు పనులు చేయండంటూ సోమవారం తిరిగి పనులను ప్రారంభించారు. ఈ పనులు సాగుతాయో లేక ఆగుతాయో వేచిచూడాలి.



ఫారెస్ట్ అధికారులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

# నిమ్న వర్గాల అభ్యున్నతికి సావిత్రి బాయి కృషి

**ఆదోని, మేజర్ న్యూస్ :** నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఘనత సావిత్రిబాయి పూలేకే దక్కిందని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు పేర్కొన్నారు. సోమవారం సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి సందర్భంగా, చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆమె మహిళల హక్కుల కోసమేకాకుండా కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. 1848లో జనవరి 1న పూణెలో తన భర్త జ్యోతిరావు పూలతో కలిసి మొట్టమొదటిసారిగా పాఠశాలను ప్రారంభించారన్నారు. ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి ఉపాధ్యాయు రాలు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు దేవిశెట్టి ప్రకాష్ , బండారి రాజేశ్వరరావు, బెస్త ప్రకాష్, వికలాంగుల నాయకులు వెంకటేష్, శ్రీనివాసులు, కత్తి రవి, , తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి నిల్వ చేయండి

## – కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్



వీసిలో పాల్గొన్న కలెక్టర్




వీసి దృశ్యం

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** ప్రతి వర్షపు నీటిబొట్టును ఒడిసిపట్టి నిల్వ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ ఆదేశించారు. సోమవారం న్యూఢిల్లీ నుండి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో జరుగుతున్న పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కర్మ భూమి,మాతృభూమి కే లియే కుచ్ కర్నా హై అన్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ కోరిక మేరకు జిల్లా కలెక్టర్లు చొరవ తీసుకుని చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా,అధికారులు పాల్గొన్నారు. ఈ వీసి అనంతరం జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా అధికారులతో మాట్లాడుతూ ఆయా జిలాలో జరుగుతున్న జల్ సంచయ్ జన్ భాగీదారి పనులు చేయవలసిందిగా ఆదేశించారు. ఆయా పనుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు,డ్వామా పిడి వెంకట రమణయ్య,ఇరిగేషన్ ఎస్ఈ ద్వారకానాథ్‌రెడ్డి, భూగర్భ జల శాఖ డిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మండలి ఎన్నికల్లో బిసిలకు పెద్దపీఠ వేసిన చంద్రబాబు

## – తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మండలి ఎన్నికల్లో బిసిలకు పెద్దపీఠ వేశారని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో ఉన్న స్వర్గీయ నందమూరి తారక రామారవు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా రెండోసారి ఎన్నికైన బిటి నాయుడుకు శుభాకాంక్షలు తెలియజేశారు. బిసి,ఎస్‌సి సామాజిక వర్గాలకు సిఎం చంద్రబాబు,మంత్రి నారా లోకేష్‌లు అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సిఎం, మంత్రి నారా లోకేష్‌లకు తెదేపా పార్లమెంట్ ఉపాధ్యక్షులు బేత కృష్ణుడు, కుంపటి క్రిష్ణ,వాల్మీకి సోదరులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియ జేశారు. అనంతరం బాణసంచా కాల్చి,కేక్ కట్ చేసి ఒకరికొకరు పంచుకున్నారు. తెదేపానాయకులు తిరుపాల్‌బాబు,నాగరాజు యాదవ్,జేమ్స్ పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు సామాజిక పింఛన్ మంజూరు చేయండి




**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు సామాజిక పించన్ మంజూరు చేయాలని నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. 2014 కంటే ముందు రిటైర్డ్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు సామాజిక పించన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల ఆధార్ కార్డులను ఆన్‌లైన్‌లో కొట్టగానే ఎంప్లాయిస్‌గా చూపిస్తుందని, ఏ పింఛన్ రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇపీఎఫ్ పింఛన్ రూ.1400 నుంచి రూ.2 వేల వరకు మాత్రమే రావడంతో తమ జీవనోపాధి గడవడంలేదని ఆందోళన చెందుతున్నామని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వానికి ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వమైన తమకు సామాజిక పింఛన్ భద్రత కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## పోరుబాట కార్యక్రమాన్ని యువత విజయవంతం చేయండి



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ఈనెల 12వ తేదీన పోరుబాట కార్యక్రమంలో యువత పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ ఇసాక్ బాష తెలిపారు. వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్చి 12వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న యువత పోరుబాట కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ ఇసాక్ బాష అధ్యక్షతన పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలో యువతకు 25 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఓట్లను దండుకొని యువతకు దగా చేశారని అన్నారు. మోసపూరిత వాగ్దానాలు చేసి ఏ ఒక్కటి అమలు చేయలేదని అన్నారు. సూపర్ -6 పథకాలు అమలు చేస్తానని మోసం చేశారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ సాక్షిగా సూపర్-6 పథకాలు అమలు చేయడం సాధ్యం కాదని చెప్పడం దారుణమని అన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, హామీలను తూచా తప్పకుండా అమలు చేశారని, ఇచ్చిన మాట నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. విద్యార్థులను దగా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విధి, విధానాలను ఎండగట్టేందుకు యువత కదలి రావాలని పిలుపునిచ్చారు.

## యువతను దగా చేసిన కూటమి ప్రభుత్వం



యువత పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న వైకాపా నేతలు, కార్యకర్తలు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** కేవలం అధికారం కోసం రాష్ట్ర ప్రజలకు, యువతకు సాధ్యంకాని హామిలిచ్చి నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలతో పాటు యువతను నట్టేట ముంచిందని మండల వైయస్ఆర్‌సిపి నాయకులు, ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి, నంద్యాల జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్టుప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డిలు అన్నారు. ఈనెల 12వ తేది వైయస్ఆర్‌సిపి ఆధ్వర్యంలో నిర్వహించబోయే యువత పోరు కార్యక్రమానికి సంబందించిన పోస్టర్లను సోమవారం పట్టణంలోని వైయస్ఆర్‌సిపి కార్యాలయంలో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోస్తం చేస్తున్నందుకు ప్రతి ఒక్కరు విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ చంద్రబాబు సర్కార్‌పై నిరసన గళం వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బద్దల రాజ్‌కుమార్, నంద్యాల జిల్లా వైకాపా ఉపాధ్యక్షులు కురుకుందు హరి, మండల అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ టి.రామచంద్రుడు కౌన్సిలర్లు మహేష్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు, రఫీ, మహేంద్రనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాల్ బ్యాడ్మింటన్ శిక్షణా శిబిరం ప్రారంభం



క్రీడాకారులతో కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం

**నంద్యాల అర్బన్, మేజర్ న్యూస్ :** నంద్యాల నెరవాడ సమీపంలో శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయుఏ బాల్ బ్యాడ్మింటన్ పురుషుల జట్టుకు శిక్షణా శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న జేఎన్‌టీయుఏ జట్టు ఈనెల 14 నుంచి17వ తేదీ వరకు నార్త్ యూనివర్శిటీ బెంగుళూరులో జరిగే అంతర్ విశ్వవిద్యాల యాల బాల్ బ్యాడ్మింటన్ (పురుషులు) పోటీల్లో పాల్గొంటారని అన్నారు. క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లును కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను అభినందించారు.

# రమణీయంగా.. శ్రీ బసవేశ్వర రథోత్సవం

- ఆకట్టుకున్న స్వాముల ప్రదర్శన
- స్వామివారిని దర్శించుకున్న నాయకులు



**కోసిగి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని జంపాపురం గ్రామంలో వెలసిన శ్రీబసవేశ్వరస్వామి రథోత్సవం రమణీయంగా కన్నుల పండుగగా సోమవారం జరిగింది. ఉదయం తెల్లవారుజామునుండి స్వామివారికి కుంకుమార్చన, కలశాభిషేకం, మహా మంగళారతి, ఆకుపూజలు, మహా మంగళవాతి వంటి పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో పల్లకోత్సవాన్ని చేపట్టారు. ఈ పల్లకోత్సవంలో స్వాములవారి ప్రదర్శన ఆకట్టుకోవడం జరిగింది. ఈ రథోత్సవానికి వైకాపా నాయకులు ప్రదీప్‌రెడ్డి, మురళీరెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారు. అలాగే మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, ఎంపిపి లవకుశ ఈరన్న, బెట్టన్నగౌడు, వైయస్ ఎంపిపి మాన్వి వెంకటేష్, దొడ్డి నర్సన్న, కాల్వ లక్ష్మయ్య, బుల్లి నరసింహులు, కాల్వ లక్ష్మయ్య, ఆకాష్‌రెడ్డి, సోమష్, రామాంజినేయులు, జంపాపురం నాయకులు బసిరెడ్డి, రంగారెడ్డి, సర్పంచ్ ఆరోన్, చిన్న బసిరెడ్డి, జె.కె.ఈరన్న, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఐగాట్ కర్మయోగి యాప్ ద్వారా ఉద్యోగులు

# నైపుణ్యాన్ని పెంచుకోవాలి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఐగాట్ కర్మయోగి ద్వారా ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఐగాట్ కర్మయోగి యాప్, పి-4 సర్వేలపై జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచర ణ్, డీఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఐగాట్ కర్మయోగి యాప్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంపొందించుకొనేందుకు కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్య మెళకువలను తెలుసుకుని విధులు నిర్వహించాలన్నారు. ఈ ఆన్‌లైన్ కోర్సులో దాదాపు 1865 కోర్సులు అందుబాటులో ఉన్నాయని నాలుగో తరగతి స్థాయి అధికారి నుంచి జిల్లా ఉన్నతస్థాయి అధికారి వరకు అధికారి స్థాయి వరకు అందరూ శిక్షణలో పాల్గొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. యాప్‌లో నిర్వహించిన మూడు కోర్సుల వీడియోలను విని ఆన్సర్ చేయాలన్నారు. కోర్సు పూర్తి చేసిన తరువాత సర్టిఫికేట్స్ కూడా పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. అధిక శాతం మార్కులు సాధించిన వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహాలు కూడా లభిస్తాయన్నారు ఈకోర్సులు దృశ్య మాధ్యమం, వినడం, చూడడం ద్వారా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగుల సిఎఫ్ఎంఎస్ ఐడి మరియు మొబైల్ నెంబర్ల ద్వారా లాగిన్ కావాలన్నారు. ఈకోర్సును ప్రభుత్వ ఉద్యోగులు ఈనెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సచివాలయ సిబ్బంది కూడా సదరు కోర్సుల్లో పాల్గొని త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం మొబైల్‌లో ఐగాట్ యాప్‌లో నమోదు విధానంపై పవర్‌పాయింట్ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. పి4 సర్వేను క్యూఆర్ కోడ్ స్కాన్ లింక్ ద్వారా లాగిన్ అయి ఉత్పన్నమయ్యే 11 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అందులోని పథకాలకు, దాతలకు, స్వీయకర్తలకు ఎలాంటి పేర్లు పెట్టాలన్న అంశాలపై ప్రశ్నలు ఉంటాయన్నారు. ఈనెల 25వ తేదీలోగా సర్వేను పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలన్నా రు. ఉగాది నాటికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా పి4 సర్వేను ప్రారంభించే అవకాశం ఉంటుందన్నారు.

**ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయండి :** స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాను ప్లాస్టిక్ రహిత నంద్యాల జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో అర్జీల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లాను ముందంజలో ఉంచడంతో పాటు ప్లాస్టిక్ రహిత నంద్యాల జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. దూరదృష్టితో ప్రభుత్వం స్వచ్ఛం కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తూ ప్రతిశాఖకు లాగిన్ ఇచ్చి సదరు కార్యక్రమాలను నిర్వహించి అప్‌లోడ్ చేయడంలో ఎందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**కుట్టుమిషన్ల శిక్షణను సద్వినియోగం చేసుకోండి :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన కుట్టుమిషన్ల శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. కుట్టుమిషన్లలో శిక్షణను ఇచ్చి వారి కాళ్ళ మీద వారు నిలబడేలా సహాయ సహకారాలు అందజేయడం జరిగిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో 500మందికి శిక్షణ ఇచ్చేలా కార్యక్రమాన్ని రూపొందించామని అందుకు 18సంవత్సరాల నుంచి 50సంవత్సరాల వయస్సు ఉన్న మహిళలు అర్హులను వారికి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్ ఉండేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణ కోర్సుల వ్యవధి 4గంటలు. 6గంటలు, 8గంటలకు కోర్సును విభజించడం జరిగిందని ఆసక్తిని బట్టి ఏ కోర్సునైనా ఎంచుకునే అవకాశం ఉంటుందన్నారు. 75శాతం హాజరు శాతం ఉన్న వారికి కుట్టుమిషన్లు కూడా అందజేయడం జరుగుతుందన్నారు.

# పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులకు సముచిత స్థానం

**– సోము వీరరాజు ఎమ్మెల్సీ నియామకంపై హర్షం వ్యక్తం చేసిన అభిరుచి మధు**

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** బీజేపీని నమ్ముకొని కష్టపడి పని చేసిన నాయకులకు అధిష్టనం సముచిత స్థానం కల్పిస్తుందని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు అభిరుచి మధు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ తరుపున సోము వీరరాజుకు ఎమ్మెల్సీగా నియామకంపై అభిరుచి మధు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీని నమ్ముకొని పని చేసిన వారికి అధిష్టానం తగిన గుర్తింపు ఇస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఖాళీ అవుతున్న 5 ఎమ్మెల్సీ స్థానాల్లో కూటమి ప్రభుత్వంలో 3 టీడీపీ, 1 జనసేన, మరోకటి బీజేపీకి కేటాయించడం జరిగిందని అన్నారు. బీజేపీలో నాయకులు సైతం ఊహించని విధంగా పదవులు అదృష్టంగా వస్తున్నాయని అన్నారు. పార్టీకి అంకిత భావంతో పని చేసిన వారికి చక్కటి గుర్తింపు వచ్చిందనడానికి ఇది నిదర్శనమని అన్నారు. ఎన్నో ఏళ్ళుగా పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన సోము వీరరాజుకు ఎమ్మెల్సీ పదవి రావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈసందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు.



సోము వీరరాజు

సూర్య



## జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో ఎల్ కె ఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** ఈ నెల 9 వ తేదీ నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణ డిగ్రీ కాలేజీలో నిర్వహించినటువంటి చదరంగం పోటీల లో ఎల్కేఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు వివిధ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు మరియు ప్రోత్సాహక పత్రాలు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, కోఆర్డినేటర్స్, ఏవో మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## ఆన్ లైన్‌లో ఒకరి పేరు బదులు మరో పేరు నమోదు



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామం పోలి మేరలో సర్వేనెంబరు -225లో భూమి 5.46 ఐదు ఎకరముల 46 సెంట్లు భూమి చిన్న తుంభళం గ్రామానికి చెందిన రెహమాన్ కూమారుడు మహమ్మద్ గనీసాబ్‌కు వారసత్వం కింద సంక్రమించిందని అయితే ఇదే సర్వే నెంబరు మీద నూర్ మహ్మద్. గౌస్ మొహీద్దీన్. ఎం.మహబూబ్ భాషా ఆన్ లైన్‌లో నమోద్ అయిందని మహమ్మద్ గనీసాబ్ సోమవారం పెద్దకడుబూరు స్థానిక తహశీల్దారు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్ సెల్‌లో మండల తహశీల్దారుకి ఫిర్యాదు చేసినట్లు మహ్మద్ గనీసాబ్ విలేకరులకు తెలిపారు. భూమి తమకు వారసత్వం కింద సంక్రమించిందని తెలి పారు. అయితే ఇటీవల జరిగిన భూరీసర్వే లో అధికారులు తప్పిదంవలన తమపేరు కాకుం డా ఇదే సర్వే నెంబరులో నూర్ అహ్మద్‌కు ఎల్ పి నెంబరు- 947లో0.61సెంట్లు. చిన్న తుంభళం గౌస్ మొహీద్దీన్ ఎల్ పి. ఎం. నెంబరు- 954.లో2.12ఎకరములు.ఎల్ పి ఎం.నెంబరు -1122లో 22.00 రెండు ఎకరములు. ఎం. మహబూబ్ భాష. ఎల్. పి. ఎం. నెంబరు - 1247లో0.73సెంట్లు భూమి అన్ లైన్లో రికార్డులో నమోదు అయిందని తెలిపారు. అయితే పైన తెలిపిన వారి పేర్లు తొలగించి అసలైన వారసులు మహమ్మద్ గనీసాబ్ పేరుమీదుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వారు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## మంచినీటి ట్యాంకులను శుభ్రపరచండి




**ఎమ్మిగనూరు మేజర్ న్యూస్ ప్రతినిధి :** పట్టణంలో 17 వార్డులో గత సంవత్సర కాలముగా మున్సిపల్ అధికారులు నీటి కోసం ట్యాంకు ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారులు ట్యాంకులు . పట్టించుకోవడం లేదని.ఐపివైఎల్ జిల్లా కార్యదర్శి కె చిన్ని ప్రసాద్. కార్మిక సంఘం కార్యదర్శి పి మాణిక్యంమున్సిపల్ అధికారులు విమర్శించారు. చిన్నివారు మంచినీళ్లు ట్యాంకు దగ్గర నిరసన వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎండాకాలం వచ్చింది పట్టణంలో ఏప్రిల్ మే నెలలో నీటి కొరత . ఏర్పడుతుంది ఎక్కడికి అక్కడ ఎమ్మిగనూరులో మున్సిపల్ అధికారులు ప్రతి వార్డులో నీటి ట్యాంకులు తయారు చేశారు. కొన్ని ప్రాంతాలలో నీటి ట్యాంకులు పనిచేయడం లేదు అని వాటిని శుభ్రపరచాల్సిన బాధ్యత మున్సిపాలిటీకి లేదా అంటూ మండిపడ్డారు . ప్రతి వార్డులో నీటి ట్యాంకులు శుభ్రం చేసి నీటిని అందించాలి. కొన్నిచోట్ల మోటార్లు రిపేర్లు ఉన్నాయి. వాటిని రిపేరు చేయాలి. ప్రజలకు నీటిని అందించాలి అని నాయకులు డిమాండ్ చేశారు. లేనియెడల మున్సిపల్ కార్యాలయము నందు. ధర్నా కార్యక్రమం చేపడతాం అని హెచ్చరించారు ఈ సమావేశంలో. నరసప్ప వెంకట రమణమ్మ నూర్ భాషా రోహిత్ అబ్దుల్ నూరి గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

## గోకులం షెడ్డును ప్రారంభించిన ఎంపిడిఓ

**గడివేముల మేజర్ న్యూస్:** మండలంలోని బూజునూర్ గ్రామంలో సోమవారం నాడు మండల అభివృద్ధి అధికారి వాసుదేవ గుప్తా రెండు లక్షల 30 వేల రూపాయలతో నిర్మించిన గోకుల షెడ్డును ప్రారంభించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గోకుల షెడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మండలంలోని 43 గోకుల షెడ్డులు మంజూరయ్యాయని 24 గోకుల షెడ్ల నిర్మాణం పూర్తయిందని మిగతా గోగుల షెడ్లు పనులు జరుగుతున్నాయని ఏపీవో వెంకటరమణ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో వెంకటరమణ తెలిపారు.


గోకులం షెడ్డు ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో

## చెత్త నుండి సంపద

**కృష్ణగిరి,మేజర్‌న్యూస్ :** చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాల్సిందిగా కృష్ణగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శి చిన్న లక్ష్మప్ప అన్నారు.మండల కేంద్రమైన కృష్ణగిరి గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని గురించి వివరిస్తూ అవగాహన కల్పించారు.కృష్ణగిరితో పాటు ఎస్.ఎర్రగుడి చిట్యాల ఇంకా మూడు గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.ప్రతి కుటుంబానికి రెండు ప్లాస్టిక్ బుట్టలు అందజేస్తామన్నారు.పచ్చ రంగు ప్లాస్టిక్ బుట్టలో తడి చెత్త,నీలి రంగు ప్లాస్టిక్ బుట్టలో పొడి చెత్తను వేసి మీ ఇంటి దగ్గరకు వచ్చే గ్రామ పంచాయతీ క్లాప్ మిత్రకు అందజేయాలన్నారు. తద్వారా చెత్త సంపద తయారీ కేంద్రానికి తీసుకొని వచ్చి వేరు ఏయడం వలన సంపద సృష్టి అవుతుందని ఆయన పేర్కొన్నారు.

## బిల్లులు పెట్టమంటే గ్రామ కార్యదర్శులు కమిషన్ అడుగుతున్నారు

జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే గంగుల నాని


జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల నాని బృందం

**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** నియోజకవర్గ పరిధిలోని రుద్రవరం మండలానికి సంబంధించిన వైసీపీ గ్రామ సర్పంచులతో కలిసి ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల నాని సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. రుద్రవరం మండలానికి సంబంధించిన వైఎస్ఆర్సీపీ గ్రామ సర్పంచ్ లు వారి గ్రామాలలో చేసిన పనులకు గాను బిల్లులు పెట్టమంటే సంబంధిత గ్రామ సెక్రెటరీలు కమిషన్ అడుగుతున్నారని లేకపోతే బిల్లులు పెట్టమని అంటున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై గ్రామ సర్పంచులు అందరూ రుద్రవరం మండల ఈ ఓ ఆర్ డి కి ఫిర్యాదు చేసిన ఎటువంటి చర్యలు తీసుకోలేదని జిల్లా కలెక్టర్ కు తెలిపారు. నిజా నిజాలు విచారించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ను మాజీ ఎమ్మెల్యే గంగుల నాని కోరడం జరిగింది. ఆయనతో పాటు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, రుద్రవరం మండల వైసీపీ గ్రామ సర్పంచులు ఉన్నారు. అనంతరం వారు మీడియా సమావేశంలో తమ సమస్యను తెలపడం జరిగింది.

## మా సమస్యకు పరిష్కారం చూపించండి ఎమ్మార్వో గారూ..

**మిడుతూర్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పీరు సాహెబ్ పేట గ్రామంలో రెడ్డివారి వంశస్థులు ఆంజనేయ స్వామి గుడి నిర్మించారు. ఆ నిర్మాణానికి గాని కొంతమేర అనగా 10.50పొలమును కేటాయించారు దాదాపుగా దేవాలయం పేరిట 1930,1936,1942రెడ్డివారి వంశస్థులు దేవాలయం పేట రిజిస్ట్రేషన్ చేయించారు అయితే గంగాధర్ రెడ్డి అనే వ్యక్తి అక్రమంగా ఆన్లైన్ చేయించుకున్నాడని గతంలో కూడా ఫిర్యాదు చేసి పట్టించుకోవడంలేదని పి జి ఆర్ ఎస్ లో సోమవారం తహసిల్దార్ కు మరోసారిమా సమస్యను పరిష్కరించండి అని ఒక వినతి పత్రం సమర్పించారు. గతంలో కూడా పిజి ఆర్ ఎస్ ఫిర్యాదు చేస్తే ఇంకా మా సమస్య పరిష్కారం కాలేదని తాహాసిల్దార్ శ్రీనివాసులకు ప్రత్యేకంగా వినతిపత్రం సమర్పించారు. దీనిపై సూర్య పాత్రికేయుడువివరణ కోరగా ఆ సదరు వ్యక్తికి నోటీస్ ఇవ్వడం జరిగింది. అతను ఈ పొలంపై హైకోర్టుకు వెళ్లాడు హైకోర్టు దీనిపై కమిటీ నిర్ణయించి ఆరు నెలల లోపల ఎండోమెంట్ మరియు కలెక్టర్ చర్య తీసుకోవాలని హైకోర్టు జారీ చేసిందని ఎమ్మార్వో అన్నారు. కానీ ఈ భూమి 1930 లోనే దేవాలయం పేరిట మా పెద్దలు రిజిస్ట్రేషన్ చేయించారని రెడ్డివారి వంశస్థులు అంటున్నారు మా ఆలయ కమిటీ సభ్యులు అందరము కలిసి ఆ భూమిని శ్రీరామ చారిబుల్ సొసైటీ రిజిస్ట్రేషన్ చేయించాము అందుకు గంగాధర్ రెడ్డి పేరును తొలగించి దేవాలయం పేరిట ఆన్లైన్ చేయాలని పి జి ఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసారు దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీనిని వెంటనే ఆన్ లైన్ తొలగించి శ్రీరామచంద్రమూర్తికి, ఈశ్వరునికి ,గోపాలకృష్ణునికి ఆంజనేయ స్వామి పేర్లమీద ఆన్లైన్ నమోదు చేయాలని రెడ్డివారి వంశస్థులు తహసిల్దార్‌ను కోరారు.


ఫిర్యాదు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## వర్మీకంపోస్టుతో పంచాయతీ ఆదాయాన్ని పెంచాలి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** ప్రతి గ్రామంలో ప్రజలు తమ ఇండ్లలోని తడి, పొడి చెత్తలను పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త బండ్లలోనే వేయాలని ఈవోఆర్డి అనంతశయనా కోరారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని పలు వీదులలో ఈవోఆర్డీ, గ్రామ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్, గ్రామ వార్డు సభ్యులు పర్యటించారు. ప్రతి ఇంటికి తడి, పొడి చెత్తలను వేసుక నేందుకు గాను రెండు ప్లాస్టిక్ డబ్బాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడిచెత్త పొడిచెత్తలతో వర్మీకంపోస్టును తయారు చేయాలని దాంతో పంచాయ తీలకు ఆదాయం పెంచాలన్నారు. గోనెగండ్లలోని చెత్త సంపద కేంద్రంను వారు సందర్శించారు. రోజుకు ఎంత చెత్త సేకరిస్తున్నారని దాంతో ఎంత వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారని చెత్త సంపదకేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈవోఆర్డి మాట్లాడుతూ వర్మీ కంపోస్టును తయారు చేసి రైతులకు అమ్మకాలు జరిపి పంచాయ తీలకు ఆదాయాన్ని తీసుకురావాలిన కార్యదర్శికి సూచించారు. ఎంత మంది సిబ్బంది ఉన్నారు. ఎలా పనిచేస్తున్నారు. పనిలో ఆజాగ్రత్తగా ఉండరాదని సూచించారు. గ్రామాలలో తాగునీటి సమస్య, వీధిదీపాల సమస్య లేకుండా చుసుకోవాలని కోరారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రభలకుండా పంచాయతీ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు త్వరితగతిన చేయాలని డ్రైనేజిలు శుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందజేశారు తాగు నీటి సమస్య రాకుండా చూడాలని కోరారు. ఈ కార్యాక్రమంలో పంచాయతీ శానిటరీ ఇన్స్పెక్టర్ మలాంగ్, సుబాన్, అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.



తడి,పొడి చెత్తల డబ్బాలను ప్రజలకు పంపిణీ చేస్తున్న అధికారులు

ప్రభుత్వ బాలికల వసతి గృహం

## వార్డెన్‌కు నోటీసులు

**బనగానపల్లె మేజర్‌న్యూస్ :** బనగానపల్లె పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలికల వసతి గృహం వార్డెన్‌కు బనగానపల్లె పంచాయితీ ఈ.ఒ సతీష్ కుమార్ రెడ్డి నోటీసులు జారీ చేశారు. బాలికల వసతి గృహం ప్రక్కనే ఉన్న హైస్కూల్ గ్రౌండ్‌లోకి బాలికల వసతి గృహ డ్రైనేజి వాటర్ వెలుతున్నందున హైస్కూల్ గ్రౌండ్‌లో క్రీడాకారులకు వ్యాయామం చేసే వారికి పాదచారులకు ఇబ్బందికరంగా మరియు ప్రజా ఆరోగానికి నష్టం కలిగే విధంగా ఉందని వారికి నోటీసులు అందించారు. ఈ నోటీసుకు మూడు రోజుల్లోపల డ్రైనేజి వాటర్ బయటికి రాకుండా చర్యలు చేపట్టాలని లేని యెడల పంచాయితీరాజ్ చట్టం కింద డ్రైనేజి పనిని తొలగించి అందుకు అయ్యే ఖర్చును వార్డెన్ నుండి వసూలు చేస్తామని అంతేకాక పోలీసుల ద్వారా కూడా న్యూసెన్సు కేసు నమోదు చేసే అవకాశం ఉందని వారు తెలిపారు.

## ఎస్సీ హాస్టల్ భవన నిర్మాణానికి నిధులివ్వండి

◆ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి వినతి


మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు అర్బన్, మేజర్ న్యూస్:** 'పేద పిల్లలు చదువుకునే ఎస్సీ సంక్షేమ హాస్టల్ భవన నిర్మాణానికి వెంటనే నిధులు ఇవ్వాలని' ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వరరెడ్డి కోరారు. సోమవారంఅసెంబ్లీ సమావేశ విరామ సమయంలో.. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎస్సీ బాలురు, బాలికల కోసం నూతన హాస్టల్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దోలా బాల వీరాంజనేయస్వామిని ఎమ్మెల్యే బీవీ కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ్ యోజన(పీఎం -ఏజేఏవై)పథకం ద్వారా 300 పడకల కళాశాల బాలుర హాస్టల్ (జీం2), 200 పడకల బాలుర హాస్టల్ (జీం1), 300 పడకల కళాశాల బాలికల హాస్టల్ (జీం2) అలాగే 200 పడకల బాలికల హాస్టల్ (జీం1) నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు ఇచ్చి సహకరించాలని ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రిని ఎమ్మెల్యే అభ్యర్థించారు. ఎస్సీ విద్యార్థులకు మెరుగైన విద్య, వసతి సదుపాయాలను సమకూర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ స్పష్టం చేశారు. ప్రణాళికలు, అంచనాల ప్రతిపాదనలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఇప్పటికే సూచించడం జరిగిందన్నారు. పేద ఎస్సీ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా వీలైనంత త్వరగా నిధులను మంజూరు చేసుకుని హాస్టల్ భవనాల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బీవీ తెలిపారు.

# పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలి


ఎంపీడీవో కి వినతి పత్రం అందజేస్తున్న మండల పంచాయతీ కార్యదర్శులు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించాలని గోనెగండ్ల మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు బైలుప్పల వెంకటేశ్వర్లు, తాటికోండ వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మండల కార్యదర్శుల సంఘం సభ్యులు ఎంపీడీవోకు సమస్యలతో కూడిన వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభ త్వం కార్యదర్శులతో వివిధ రాకల సర్వేలతో పలు కార్యక్రమాలతో చేయిస్తుందని దీంతో వారి పై పనిభారం పెరిగిందని, సొంత, కుటుంబ విషయాలకుసెలవుదినాలను సైతంవినియోగించుకోవడానికి కూడా వీలు లేకుండా పోతుందని వారన్నారు. తీవ్రమైన పనిఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 20 కార్యక్రమాలను ప్రభుత్వం కార్యదర్శులతో చేయిస్తుందని వారు తెలిపారు. కావున ఉన్నతాధికారులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎంపీడీవో మణిమంజరి సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకు వెలతానని తెలిపారు. సుధకర్, తిరుమల, ప్రభాకర్, నరసన్న, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వైసీపీ బలోపేతానికి కృషి చేయండి..మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**కృష్ణగిరి,మేజర్‌న్యూస్ :** వైసీపీపార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విజ్ఞప్తి చేశారు.మండల పరిధిలోని ఎస్.ఎర్రగుడి గ్రామానికి చేందిన వై.రాజశేఖర్‌రెడ్డి వాణి జ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా పత్తికొండ మాజీ ఎమ్మెల్యేను కర్నూలులో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి మోహన్‌రెడ్డి రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి,కృష్ణగిరి ఎంపిపి డాక్టర్ కంగాటి వెంకట రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పని చేస్తున్న వారందరికీ సమూచిత స్థానం



కల్పిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఎర్రగుడి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువత పోరుబాటను విజయవంతం చేద్దాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12 న జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలో నిర్వహించే యువత పోరు కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీపీ వీరభద్రుడు పిలుపునిచ్చారు.సోమవారం ముత్యాలపాడు బస్టాండులోని ఆయన స్వగృహంలో వైసీపీ శ్రేణులతో కలసి యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు, ఆళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల బీజేంద్రారెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్రం ఏర్పడి తొమ్మిది నెలలైన ఇప్పటి వరకు ఏలాంటి హామీలు నెరవేర్చలేదన్నారు.ఏటా డిఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగులకు భృతి,ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం హామీలను నెరవేర్చ లేదన్నారు.పీజు రియంబర్స్ మెంట్ విడుదల కాక చాలా మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారన్నారు.రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్షాన్ని ఎండగడుతూ ఈ నెల 12 చేపడుతున్న యువత పోరుకు భారీగా విద్యార్థులు,యువత తరలి రావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వైసీపీ నాయకులు సేవాదల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ,గణేష్‌రెడ్డి,సర్పంచ్ గోవిందయ్య,ప్రభుకాంత్,రంగయ్య,శ్రీనివాసులు,పాల్గొన్నారు.

# తప్పుడు ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్త ఉండండి ..కమిషనర్ గంగిరెడ్డి

**మున్సిపాలిటీ లేదా సచివాలయంలో పన్నులు కట్టండి**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** కొందరు వ్యక్తులు మున్సిపల్ కమిషనర్ అంటూ పన్నులు చివరి రోజు క్యూ ఆర్ కోడ్ పంపుతా వెంటనే డబ్బులు పంపండి లేదంటే జరిమాన పడుతుందని మోసపూరిత మాటలతో గుర్తు తెలియని ఫోన్ కాల్స్ నమ్మవద్దని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ దుకాణాల యజమానులకు, ప్రజలకు కాల్స్ చేస్తూ డబ్బులు ట్రాన్స్ ఫర్ చేయించుకుంటున్నారని అటువంటి వ్యక్తులతో జాగ్రత్త ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్ తో ప్రజలు జాగ్రత్తగా ఉంటూ, మున్సిపాలిటీ పన్నులను నేరుగా ప్రజలు మున్సిపల్ కార్యాలయం లేదా స్థానిక సచివాలయంలో పన్నులు చెల్లించి రసీదు తీసుకోవాలన్నారు. ఇటువంటి తప్పుడు ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్త ఉండాలని సూచించారు.

# రైతుల కళ్ళల్లో ఆనందం..

**ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ కృషికి కృతజ్ఞతలు తెలిపిన రైతులు**

**దొర్నిపాడు, మేజర్ న్యూస్ :** కేసి కెనాల్‌కు రబీలో సాగు చేసిన పంటలకు నీరు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలుపుతూ కేసి కెనాల్ వద్ద సోమవారం రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డి ఈ రవీంద్ర మాట్లాడుతూ వంతుల వారీగా నీళ్లు చివరి ఆయకట్టు వరకు వస్తాయని రైతులు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. రబీ పంటను కాపాడాలనే ఉద్దేశంతోనే ఎమ్మెల్యే అఖిలప్రియ ఉన్నత అధికారులతో మాట్లాడి సాగుకు నీరు వచ్చేందుకు కృషి చేసారని అందుకు కృతజ్ఞతలు తెపుతున్నట్లు అయన తెలిపారు అనంతరం డిసి చైర్మన్ బొబ్బురి వెంకటస్వామి మాట్లాడుతూ రైతుల పక్షపాతీగా భూమా కుటుంబం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని పైన ఉన్న రైతులు నీటిని వృధా చేయరాదని వంతులవారిగా నీటిని వాడుకొని ఏ ఒక్క రైతు నష్టపోకుండా అందరికి నీరు అందెందుకు కృషి చేసి ముందుకెళ్లాలని అయన అన్నారుకేసి కెనాల్ క్రింద వరి సాగుకు నీరు కొరతరవడం పంటలు ఎండుదశలో ఉండటం విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఎమ్మెల్యే సుంకేసుల నుండి సాగునీటిని విడుదల చేయించినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపు తున్నట్లు అయన అన్నారు భూమా అంటే ఒక భరోసా భూమా అంటే ఒక ధైర్యం అనిఉయ్యాలవాడ. 43డిసి చైర్మన్ వెంకటసుబ్బయ్య అన్నారు చివరి ఆయకట్టు వరకు నీరు అందుతాయని అందరు నీటిని వాడుకొని పంటలనుపండించుకోవాలని అయన అన్నారు అలాగే 16లాక్ నుండి కేసి కెనాల్ అధికారులు నీటిని ఆదివారం విడుదల చేసారని ఈనెల 27వ తేదివరకు నీరు వస్తాయని అధికారులు హామీ ఇచ్చారన్నారు ఈ కార్యక్రమంలో డిసి చైర్మన్‌లు ఎరువా ప్రసాదరెడ్డి. బొబ్బురి వెంకట స్వామి వైస్ చైర్మన్ లు లింగుట్ల నాయుడు. కుందూరు రామిరెడ్డి నాయినిగారి శ్రీను. టిడిపి నాయకులు సిద్ది సత్యం. నర్రెద్దుల మహేశ్వరరెడ్డి. గోపాల్ నాయుడు కేసీకెనాల్ డి ఈ రవీంద్ర. ఏ ఈ. రంగారెడ్డి. కేసి కెనాల్ లస్కర్లు. రైతులు పాల్గొన్నారు .


కేసి కెనాల్ వద్ద డిసి చైర్మన్ లు రైతులు. టిడిపి నాయకులు

# పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి




**పాములపాడు మేజర్ న్యూస్ :** సావిత్రీబాయి పూలే ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయుర్వేద వైద్య అధికారిని సావిత్రమ్మ అన్నారు . సోమవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో దళిత బిసి సంఘం నాయకులతో కలిసి సావిత్రీబాయి పూలే128 వర్ధంతి నిర్వహించారు. సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి. నివాళులర్పించారు ఈ ఆమె మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం పోరాటం చేసి సంఘ సంస్కర్త, స్త్రీ విద్యాభివృద్ధికి కృషిచేసిన దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రి పూలే అని అన్నారు.యువతీ యువకులు సావిత్రీ బాయి పూలేను ఆదర్శంగా తీసుకుని పట్టుదలతో చదివి ఉద్యోగాల్లో రాణించాలన్నారు.బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కులమత భేదాలు లేని సమాజాన్ని రూపొందించిన సావిత్రి బాయి పూలే నేటి తరం మహిళలకు ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణారెడ్డి, నల్లమల్ల అబ్రహం, రామకృష్ణ, మోహన్, నాగరాజు, వినోద్, సుధాకర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

# అహోబిలం బ్రహ్మోత్సవాలకు 33 ప్రత్యేక బస్సులు



బ్యానర్ ను విడుదల చేస్తున్న ఆర్టీసీ డిఎం వెంకటేశ్వరరావు బృందం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో జరుగుతున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల దర్శనార్థం వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ సంస్థ అన్ని ఏర్పాటు చేసినట్లు ఆళ్లగడ్డ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావుతెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆళ్లగడ్డ డిపో నుండి ఈనెల 13 నుండి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. మొత్తం 33 బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజ ర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించకుండా ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ యూనియన్ నాయ కులు పరమేశ్వర్ రెడ్డి, శేఖర్, కోటకొండ రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఆరవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ


ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ దిల్షాద్

**గూడూరు మేజర్ న్యూస్:** జూలకల్లు ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశాల కొరకు విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టినట్లు సోమవారం ప్రిన్సిపల్ దిల్షాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాలల్లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని,విద్యార్థులు ఈనెల 31 లోపు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందన్నారు. ఓసి, బిసి విద్యార్థులు రూ.150, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ. 75 దరఖాస్తు రుసుముగా చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20న ఆదర్శ పాఠశాలలో వ్రాత పరీక్షను నిర్వహిస్తామన్నారు.ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించు కోవాలని ఆమె తెలిపారు.

# 13న పెద్ద బండ బండలాగు పోటీలు

**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** శ్రీశ్రీశ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి పారువేట సందర్భంగా 13న పెద్ద బండలాగు పోటీలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ ధర్మకర్త ఎస్. కిరణ్ కుమార్ తెలిపారు. మొదటి బహుమతి ఎస్. కిరణ్ కుమార్ రూ.1,00,116 రెండవ బహుమతి సన్నీ (వినీల్ కుమార్) నాగటూరు రూ.70, 000 మూడవ బహుమతి కొణిదెల ప్రభుత్వ ఉపాధ్యాయులు రూ.40,000 నాలుగో బహుమతి కొంగర మూర్తి , మల్లె పోగు చిట్టెన్న రూ.30,000 ఐదవ బహుమతి సూది రెడ్డి మధుసూదన్ రెడ్డి , వనములపాడు సుబ్బారెడ్డి రూ.20,000 ఆరవ బహుమతి దివంగత సరోజమ్మ వడ్ల మద్దిలేటి ఆచారి జ్ఞాపకార్థం వారి కుమారులు 10,000 లు పోటీలో గెలుపొందిన ఎద్దుల జతకు అందజేస్తామన్నారు. మహానంది బండలాగు పోటీల్లో గెలుపొందిన ప్రథమ,ద్వితీయ ఎద్వైతకు ఇక్కడ అనుమతించరు.

## కాశిరెడ్డి నాయనా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం

**గడివేముల మేజర్ న్యూస్:** మండలంలోని దుర్వేసీ బాట సమీపాన సోమవారం నాడు దుర్వేసి గ్రామానికి చెందిన ద్వారం రామ సుబ్బారెడ్డి, ద్వారం హైమావతి, పాణ్యం మండలం కొట్టాల గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వరమ్మ గా దంపతుల ఆధ్వర్యంలో కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విరు మాట్లాడుతూ ప్రతి సోమవారం నాడు మరియు అమావాస్య రోజున మరియు పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## రాళ్ల ట్రాక్టర్ బోల్తా పడి బాలుడు మృతి



**పాములపాడు మేజర్ న్యూస్ :** మండలంలోని చెలిమిళ్ళ గ్రామ సమీపంలో రాళ్ల ట్రాక్టర్ బోల్తా పడి జస్వంత్ 15 అనే బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పాములపాడు నుంచి రాళ్లలోడుతో ట్రాక్టర్ మండలంలోని లింగాల గ్రామానికి వెళుతోంది. ఈ క్రమంలో చెలిమిళ్ళ గ్రామ సమీపంలోని ఎద్దుల వంక వాగు వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. రాళ్లపై కూర్చున్న బాలుడు జస్వంత్ పై రాళ్లుపడ్డాయి దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ నగపై నిల్చున్న మరో బాలుడు సంగీత రాజు ఎలాంటి గాయాలు లేకుండా తప్పించుకున్నాడు. ప్రస్తుతం డ్రైవర్ శంకర్ పరారయ్యాడు విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకొని వివరాలు సేకరించారు.

సూర్య

మంగళవారం | 11 మార్చి 2025

# అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలి

**– అర్జీలు పోర్టల్‌లో రిజిస్టర్ చేయకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి**

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నాణ్యతతో అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా పేర్కొన్నారు. అర్జీలను పోర్టల్‌లో రిజిస్టర్ చేయమని చెప్పినప్పటికీ ఇంకా కొన్ని మండలాల్లో నమోదులో జీరో ఉండడంపై జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వచ్చిన వినతులను జాయింట్ కలెక్టర్ బి నవ్యతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు వచ్చిన వెంటనే పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సిఎంఓ ఫిర్యాదుల విషయంలో అధికారులు పౌరులను సంప్రదించకుండ పరిష్కరిస్తున్నట్లు గుర్తించడం జరిగిందని అర్జీదారులతో కచ్చితంగా మాట్లాడి వారికి ఎండార్స్‌మెంట్ అందచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్



చల్లా కళ్యాణి,డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు పోరాటాలు చేస్తాం

**– కోడుమూరు నియోజకవర్గ వైసీపీ ఇంఛార్జ్ ఆదిమూలపు సతీష్**

**కర్నూలు రూరల్, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు పోరాటాలు చేస్తామని కోడుమూరు నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ ఆదిమూలపు సతీష్ అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి లేదు, 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. వాలంటీర్లను తొలగించి 2లక్షల ఉద్యోగాలు తొలగించారన్నారు. మెగా డిఎస్‌సి పేరుతో నిరుద్యోగులతో చెలగాటమాడుతున్నారన్నారు. తల్లికి వందనంపై ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. అసెంబ్లీలో ప్రశ్నించేవారు లేరని కూటమి ప్రభుత్వం విచ్చలవిడిగా అపద్దాలను



**మాట్లాడుతున్న కోడుమూరు వైసిపి ఇంచార్జ్ ఆదిమూలపు సతీష్**

చెబుతుందని మండిపడ్డారు. సూపర్‌సిక్స్ హామీలను అమలు చేసేందుకు వైసిపి పార్టీ ఈ నెల 12న పోరుబాటలో భాగంగా నిరసన ర్యాలీ చేపడుతుందన్నారు. ప్రజల తరుపున పోరాటానికి తాము ఎప్పుడు సిద్ధంగా ఉన్నామని విద్యార్థి,యువతకు మద్దతుగా యువత పోరుకు అందరు సహకరించి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జడ్‌పిటిసి ప్రసన్న కుమార్,కర్నూలు వైస్ ఎంపిపి నెహమియా, ఎంపిటిసి మద్దిలేటి, ఎంపిటిసి శేఖర్,అధికార ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కొంతలపాడు శ్రీనివాసరెడ్డి,మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు,కోడుమూరు యువజన విబాగం అధ్యక్షులు వెంకటేష్,సోషల్ మీడియా అధ్యక్షులు గిరి ప్రసాద్, ప్రచార విభాగం అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి,ఎస్‌సి సెల్ అధ్యక్షులు బొజ్జన్న,కార్మిక శాఖ విభాగం అధ్యక్షులు బోయ వెంకటేష్,కోడుమూరు ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షులు రామకృష్ణ యాదవ్,మాజీ సొసైటీ ప్రెసిడెంట్ అమర్‌నాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ మోహన్‌బాబు,దస్తగిరి, సురేష్,ఆదాం, సంపత్,వెంకటేష్,పడిదంపాడు వెంకటేష్,మధు శేఖర్,రామరాజు, అనిల్,భాష, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి కోసం తల్లిని హతమార్చిన తనయుడు

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** కడుపున పుట్టిన తనయుడే తల్లి పాలిట కాలయముడు అయ్యాడు. కని పెంచిన తల్లినే కిరాతకంగా హత్య చేసిన సంఘటన మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో సోమవారం చోటు చేసుకుంది. ఇంటిని తన పేరిట వ్రాయించలేదని తల్లిని రోకలిబండతో కొట్టి దారుణంగా హతమార్చాడు. ఎస్ఐ బీటీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో సున్నం అమ్ముకుంటూ జీవిస్తున్న అంబటి చిన్న పుల్లమ్మ (70)ను ఆమె కుమారుడు బాల గుర్రప్ప సోమవారం ఉదయం ఇంటిలో ఉన్న రోకలిబబండతో



**సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ**

కొట్టాడు. తీవ్రంగా రక్తగాయాలపాలైన పుల్లమ్మను 108 అంబులెన్స్ ద్వారా చికిత్స కోసం ఆళ్ళగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఆమె మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఆళ్ళగడ్డ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐలు పరిశీలిం చారు.



**చిన్న పుల్లమ్మ (ఫైల్ ఫోటో)**

మృతురాలి అల్లుడు రమణ య్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# పీజీఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించండి : కలెక్టర్



**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి నిర్ణీత కాల పరిమితిలోపు పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన అనాలసిస్ రిపోర్టును అధ్యయనం చేసి గ్యాప్‌ను సరిచేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో 220మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.

## కూటమి ప్రభుత్వ మోసాలపై

# 'యువత పోరు'ను జయప్రదం చేయండి

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** రాష్ట్రంలోని పేద విద్యార్థులను, నిరుద్యోగ యువతను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వం వైఖరికి వ్యతిరేకంగా ఈ నెల 12వ తేదీన కర్నూలులో వైయస్ఆర్సీపీ ఆధ్వర్యంలో 'యువత పోరు' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆ వివరాలను వెల్లడించారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఫీజు రియంబర్స్మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన, అమ్మఒడి వంటి పథకాలను ప్రవేశపెట్టడమే కాకుండా సకాలంలో వారికి అందించి అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి పేద విద్యార్థుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని మాయమాటలు చెప్పి కూటమి ప్రభుత్వం యువతను నిండా మోసగించిందని విమర్శించారు. అంతేకాకుండా తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి నీకు రూ.15వేలు నీకు రూ. 15వేలు ఇస్తామని ఆశచెప్పి అప్పటి అమ్మ ఒడి పథకాన్ని పేరు మార్చేసి అధికారంలోకి వచ్చిన




**యువత పోరు' పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి.**

తర్వాత విద్యార్థులు వారి తల్లిదండ్రుల జీవితాలతో చెలగాటమాడుతుందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తే.. పరీక్షల సమయంలో ఆయా కాలేజీలు విద్యార్థు లను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందన్నారు. తల్లికి వందనం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తూ విద్యా లోకానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కక్షసాధింపు వైఖరికి నిరసనగా చేపడుతున్న యువత పోరు కార్యక్రమాన్ని విద్యార్థి సంఘాలతో పాటు ప్రతి ఒక్కరూ హాజరయ్యి దిగ్విజయం చేయాలని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. వైసీపీ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నర్సింహులు, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్, బాలాజీ, సన్నీ పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పై స్పందించి న్యాయం చేయాలి

**– కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**



**ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**కర్నూలు క్రైం,మేజర్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కొత్తపేటలో ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 122 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి త్వరితగతిన సమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని డబ్బులు తీసుకుని ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయడం లేదని కర్నూలు చిదంబరావు స్ట్రీట్‌కు చెందిన హుస్సేన్‌సాబ్ ఫిర్యాదు చేశారు. అలాగే కుమార్తె ఆస్తి కోసం వేధిస్తుందని న్యాయం చేయాలని కర్నూలు ఫరీదా బేగం ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్య రాకుండా చూడాలి

**– నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు**

**కర్నూలు నగరం, మేజర్ న్యూస్ :** వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండ అవసరమైన చర్యలు తీసుకోవాలని నగర పాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 13అర్జీలు రాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు కమీషనర్ హామీ ఇచ్చారు. అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ,మేనేజర్ యన్ చిన్నరాముడు,ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె విశ్వేశ్వర్‌రెడ్డి,సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్,ఎంఈ సత్యనారా యణ,ఆర్ఓ జునైద్,టిపిఆర్ఓ వెంకటలక్ష్మి,శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు,టిడ్కో అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



**ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న కమీషనర్**

# యాగంటి ఈశ్వర స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



**ఓర్వకల్లు, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఎన్ కొంతలపాడు గ్రామంలో వెలసిన శ్రీ అంబా సహిత యాగంటి ఈశ్వర స్వామిని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు చంద్రశేఖర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆలయ ప్రధాన అర్చకుల చేత పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి తిప్పన్న, జడ్‌పిటిసి రంగనాథ్‌గౌడ్,సర్పంచ్ మధు కేశన్న,వైసిపి నాయకులు కుమ్మరి మద్దయ్య,మాజీ సింగిల్ విండో చైర్మన్ నాగ తిరుపాలు, రమణారెడ్డి,రాము తదితరులు పాల్గొన్నారు.